క్లుప్తంగా

'ఆడబిడ్డలకు వరం కల్యాణలక్ష్మి'



బాన్సువాడ రూరల్: ఆడబిడ్డల పెళ్లికి వరం లాంటిది కల్యాణలక్ష్మి పథకమని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం బాన్సువాడలోని తన నివాసంలో వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి చెక్కులను స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి పంపిణీ చేశారు.

బిచ్కుంద పరిధిలో..

నిజాంసాగర్(జుక్కల్): బిచ్కుంద మండలంలోని పుల్కల్, హస్గుల్ గ్రామాల్లోని పలువురు లబ్ధిదారులకు శుక్రవారం స్థానిక ఎంపీపీ అశోక్ పటేల్ చేతుల మీదుగా కల్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు మారుతి, విజయలక్ష్మి నాయకులు భూమిశెట్టి, నాల్చర్‌రాజు, విజయ్, రాజు పటేల్, మారుతి ఉన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ

బాన్సువాడ రూరల్: మండలంలోని రాజారాం దుబ్బ, ఇస్లాంపూర కాలనీల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను శుక్రవారం ఎంపీపీ నీరజా వెంకట్రాంరెడ్డి తనిఖీ చేశారు. చిన్నారుల కోసం సిద్ధం చేసిన మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి వడ్డించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లోని రికార్డులను పరిశీలించారు. రికార్డు నిర్వహణలో నిర్లక్ష్యం వహించవద్దన్నారు. కౌన్సిలర్లు రుక్మిణీ గైక్వాడ్, నేహసుల్తానా హాకీమ్, పంచాయితీ కార్యదర్శి ప్రశాంతి పాల్గొన్నారు.

పాఠశాల పనుల పరిశీలన

నస్రుల్లాబాద్(బాన్సువాడ): సంగం పాఠశాల భవన నిర్మాణ పనులను ఎంపీపీ పాల్త్య విఠల్ పరిశీలించారు. పనులు నాణ్యతతో త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. విద్యార్థులకు వచ్చే సంవత్సరం భవనాలను అందించాలని కోరారు. పనులు జరుగుతున్న తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు.

బోరు బావి తవ్వకం ప్రారంభం

లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని పెద్దమ్మ ఆలయం వద్ద బోరుబావి తవ్వకం పనులను శుక్రవారం జడ్పీటీసీ శ్రీలత ప్రారంభించారు. ఆలయం వద్ద భక్తులకు తాగునీటి సౌకర్యార్థం బోరు మోటారు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ లావణ్య, ముదిరాజ్ మహాసభ మండల అధ్యక్షుడు సాయికుమార్, తదితరులు పాల్గొన్నారు.

కొల్లూర్‌లో ఊరపండుగ

బాన్సువాడ రూరల్ : కొల్లూర్‌లో శుక్రవారం ఊర పండుగను గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ఎడ్లబండ్లను అందంగా అలంకరించి ఆలయాల చుట్టూ తిప్పారు. అలాగే సాయంత్రం కుస్తీ పోటీలు నిర్వహించారు. స్థానిక పహిల్వాన్‌లతో పాటు ఇతర ప్రాంతాల మల్లయోధులు హాజరై తమ ప్రతిభ చాటారు. విజేతలకు గ్రామపెద్దలు మహేందర్‌రెడ్డి, సర్పంచ్ తుకారాం, జనార్దన్‌రెడ్డిలతో కలిసి నగదు బహుమతులు అందజేశారు.

ప్రతిభా పురస్కారం

కామారెడ్డి రూరల్: విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీసి ప్రోత్సహించాలనే ఉద్దేశంతో కీర్తి శేషులు చింతోజు బ్రహ్మయ్య, బాలమణి గార్ల జ్ఞాపకార్థంగా 2010 నుంచి బడి పిల్లలు వివిధ సాహితీ ప్రక్రియల్లో వెలువరించిన పుస్తకాలకు పోటీలు నిర్వహించి బాల ప్రతిభ పురస్కారాలు అందిస్తున్నారు. దీనిలో భాగంగా కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల(దేవునిపల్లి) విద్యార్థులు వెలువరించిన 'దేవునిపల్లి బడి పిల్లల కథలు' పుస్తకాన్ని 2022 సంవత్సరానికి గాను బాల ప్రతిభా పురస్కారానికి ఎంపిక చేశారు. కామారెడ్డి జిల్లా స్థాయిలో బడి పిల్లలు వెలువరించిన తొలి బాలల పుస్తకానికి రాష్ట్ర స్థాయిలో బాల ప్రతిభా పురస్కారం అందించడం పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయులు గంగా కిషన్, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

విగ్రహ నిర్మాణానికి భూమి పూజ

రాజంపేట: ఆరేపల్లి గ్రామంలో ఐలమ్మ విగ్రహ నిర్మాణానికి రజక సంఘం ఆధ్వర్యంలో భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ కొమ్ము యాదగిరిదగిరి సంఘ సభ్యులు కొబ్బరి కాయ కొట్టి పనులను ప్రారంభించారు. ఉప సర్పంచ్ బాలయ్య, రజక సంఘం అధ్యక్షులు శ్యామయ్య, కోశాధికిరి లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి



సదాశివనగర్(ఎల్లారెడ్డి): మహిళలు ఆర్థికంగా అభివృద్ధిని సాధించాలని ఏపీఎం రాజిరెడ్డి సూచించారు. శుక్రవారం భూంపల్లిలో చేపల పెంపకంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. చేపల పెంపకంపై స్వయం సహాయక సంఘాల కుటుంబ సభ్యులకు సదాశివనగర్‌తో పాటు లింగంపేట్ మండలాలను పైలట్‌గా తీసుకున్నామన్నారు. ఈ రెండు మండలాల్లో చేపల పెంపకంపై అవగాహన కల్పించామన్నారు. నాబార్డు సహకారంతో శిక్షణ ఇస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

- సైబర్ నేరాలతో జాగ్రత్తగా ఉండాలి
- జిల్లాలో పలుచోట్ల పోలీసుల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు



పోతురెడ్డిపల్లిలో అవగాహన కల్పిస్తున్న పోలీసులు

పిట్లం(జుక్కల్): ప్రతి ఒక్కరూ తప్పకుండా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని పిట్లం పోలీసులు పేర్కొన్నారు. పోతురెడ్డిపల్లిలో శుక్రవారం ట్రాఫిక్ నిబంధనలు, సైబర్ నేరాలపై పోలీసులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ.. ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని, ఫోర్ వీలర్ నడిపేవారు సీట్ బెల్ట్ పెట్టుకోవాలన్నారు. వాహన ధ్రువపత్రాలు వెంట ఉంచుకోవాలని, మైనర్‌లకు వాహనాలను ఇవ్వొద్దని సూచించారు. అలాగే గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేసి మీ బ్యాంక్‌కు సంబంధించిన వివరాలు అడిగితే ఇవ్వవద్దన్నారు. ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది శైలేష్, ఓంకార్, కాశగౌడ్, మసూద్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన ఉండాలి

రామారెడ్డి(ఎల్లారెడ్డి): సైబర్ మోసాలపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని రామారెడ్డి ఏఎస్సై రవీందర్ అన్నారు.శుక్రవారం ఉప్పల్‌వాయి షెడ్యూల్డ్ కులాల వసతి గృహంలో సైబర్ మోసాలు, రోడ్డు ప్రమాదాల నివారణ, షీటీంలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో షీటీం ఇన్‌చార్జి సౌజన్య,తదితరులు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడపొద్దు

దోమకొండ: మద్యం తాగి వాహనాలు నడుపొద్దని దోమకొండ ఏఎస్సై సుబ్రహ్మణ్యచారి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో వాహనదారులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. మద్యం తాగడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. అలాగే సైబర్ నేరాల గురించి వివరించారు. కానిస్టేబుళ్లు రమేష్, చంద్రకాంత్, సామ్రాట్ తదితరులు ఉన్నారు.

పెద్దకొడప్‌గల్ పరిధిలో..

పెద్దకొడప్‌గల్(జుక్కల్): విఠల్ వాడి తండాలో శుక్రవారం ఎస్సై కోనారెడ్డి ఆధ్వర్యంలో సైబర్ నేరాల పట్ల అవగాహన కల్పించారు. ఎస్సై కోనారెడ్డి మాట్లాడుతూ..ఎవరైనా సైబర్ నేరాలకు గురైనప్పుడు 1930 టోల్ ఫ్రీ నెంబర్‌కు డయల్ చేసి సమాచారమివ్వాలన్నారు. సర్పంచ్ శివారం హెడ్ కానిస్టేబుల్ సంతోష్ పాల్గొన్నారు.



ఉప్పల్‌వాయి షెడ్యూల్డ్ కులాల వసతి గృహంలో అవగాహన కల్పిస్తున్న పోలీసులు

వీఆర్‌ఏల సమస్యలపై పోరాడుదాం



మాట్లాడుతున్న మండల అధ్యక్షుడు వెంకటేశ్

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): వీఆర్‌ఏల సమస్యల సాధన కోసం అందరం కలిసికట్టుగా పోరాడుదామని నాగిరెడ్డిపేట మండల వీఆర్‌ఏల సంఘం మండల నూతన అధ్యక్షుడు సిరికొండ వెంకటేశ్ పిలుపునిచ్చారు. నాగిరెడ్డిపేట మండల కేంద్రంలో శుక్రవారం వీఆర్‌ఏల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల నూతన కమిటీని వారు ఎన్నుకున్నారు. వీఆర్‌ఏల సంఘం గౌరవాధ్యక్షుడిగా మాదాసు దుర్గయ్య(చీనూర్), మండల అధ్యక్షుడిగా సిరికొండ వెంకటేశ్(నాగిరెడ్డిపేట), ఉపాధ్యక్షుడిగా దివిటి శ్రావణ్ కుమార్(వెంకంపల్లి), ప్రధాన కార్యదర్శిగా దివిటి సురేందర్(తాండూర్), కార్యదర్శిగా బోరంచ నరేష్(తాండూర్), కోశాధికారిగా కట్ట సాయిలు(రామక్కపల్లి), సలహాదారులుగా పోతుల కిష్టయ్య(నాగిరెడ్డిపేట), తలారి ఇసాక్(మాల్తుమ్మెద), పిట్ల సుధాకర్ (తాండూర్), తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీఆర్‌ఏల సమస్యల సాధన కోసం కృషి చేస్తానని నూతన కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయంపై బీజేపీ సంబురాలు



భిక్కనూరులో సంబురాలు చేసుకుంటున్న బీజేపీ శ్రేణులు

భిక్కనూరు/కామారెడ్డి టౌన్/బాన్సువాడటౌన్ : హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లాల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి ఏవీఎన్ రెడ్డి ఘన విజయం సాధించడంతో బీజేపీ, తపస్ ఆధ్వర్యంలో సంబురాలు నిర్వహించారు. భిక్కనూరు, కామారెడ్డి, బాన్సువాడలలో టపాకాయలు పేల్చి మిఠాయిలు పంపిణీ చేశారు. ఏవీఎన్‌రెడ్డిని గెలిపించిన ఉపాధ్యాయులకు ప్రత్యేక ధన్యవాదాలని, బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి ఈ విజయం చెంపపెట్టు వంటిదని నాయకులు అన్నారు. రానున్న రోజుల్లో తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం కచ్చితంగా ఏర్పడుతుందని జోస్యం చెప్పారు.



బాన్సువాడలో ..



నినాదాలు చేస్తున్న తపస్ నాయకులు

సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి



కామారెడ్డిలో మాట్లాడుతున్న వివిధ సంఘాల నేతలు



భిక్కనూరులో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న సౌత్‌క్యాంపస్ విద్యార్థులు

సాక్షి నెట్‌వర్క్ : ప్రశ్నాపత్రాల లీకేజీ వ్యవహారంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వ అసమర్థతను దెప్పిపొడుస్తూ జిల్లా వ్యాప్తంగా పలు ప్రజా సంఘాలు, బీజేపీ, బీజేవైఎం నాయకులతో పాటు భిక్కనూరు సౌత్ క్యాంపస్ విద్యార్థులు శుక్రవారం ఆందోళనలకు దిగారు. ప్రభుత్వ దిష్టిబొమ్మలను దహనం చేశారు. లీకేజీపై సిట్టింగ్ జడ్జి లేదా సీబీఐతో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. నైతిక బాధ్యత వహిస్తూ టీఎస్‌పీఎస్‌సీ చైర్మన్ రాజీనామా చేయాలన్నారు. రాష్ట్రంలో నిరుద్యోగులు ఒక పూట భోజనం చేస్తూ కడుపు చంపుకొని ఉస్మానియా విశ్వవిద్యాలయం పరిసర ప్రాంతాల్లో ఉంటూ, తల్లిదండ్రులు భూములు అమ్మి పంపించిన డబ్బులతో కోచింగ్ సెంటర్లలో లక్షల రూపాయలు ఫీజులు కడుతూ ప్రిపేర్ అయ్యి పరీక్షలు రాస్తే తినే పల్లెంను గద్దలు తన్నుకుపోయినట్లు ప్రభుత్వం తీరు ఉందని బీజేపీ నేతలు మండిపడ్డారు.



లింగంపేటలో .. బీజేపీ, బీజేవైఎం నాయకులు

బీఆర్‌ఎస్‌లో చేరిక



మాచారెడ్డి: మండలంలోని ఫరీద్‌పేటలో బీజేపీ, బీజేవైఎంలకు చెందిన పలువురు శుక్రవారం ఎంపీపీ నర్సింగరావు సమక్షంలో బీఆర్‌ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. బీజేవైఎం మండల కార్యదర్శి బెజ్జంకి రాజు, నాయకులు బాల్ రాజు, మహేందర్, అనిల్, పెంటయ్య, తదితరులు బీఆర్‌ఎస్‌లో చేరారు. సర్పంచ్ భాగ్యమ్మ, వైస్ ఎంపీపీ నర్సింహారెడ్డి, నాయకులు దీపక్, గంగిరెడ్డి ఉన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపనతో సంబంధం లేదు

బాన్సువాడ టౌన్: రాంపూర్ తండాలో జరిగిన రాంరావు మహరాజ్ విగ్రహ ప్రతిష్ఠాపనతో పోచారం తండా, రాంపూర్ తండాల వాసులకు ఎలాంటి సంబంధం లేదని ఆయా తండాలవాసులు పేర్కొన్నారు. శుక్రవారం బాన్సువాడలో రెండు తండాల వాసులు మాట్లాడారు. రెండు రోజుల క్రితం రెండు కుటుంబాలకు చెందిన వారు మాత్రమే రాంరావు మహరాజ్ విగ్రహ ప్రతిష్ఠాపన చేసినట్లు తెలిసిందన్నారు. సేవలాల్ మహరాజ్ మందిరం పక్కనే రాంరావు మహరాజ్ మందిరాన్ని నిర్మిస్తున్నామని, త్వరలో మందిరాల ప్రారంభోత్సవం ఉంటుందని అన్నారు.

రేవంత్‌రెడ్డి సభను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న కాంగ్రెస్ నేత కాసుల బాల్‌రాజ్

బాన్సువాడ టౌన్: ఈ నెల 20న బాన్సువాడ నియోజకవర్గంలో టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి పాదయాత్ర నిర్వహించనున్నట్లు బాన్సువాడ నియోజకవర్గం ఇన్‌చార్జి కాసుల బాల్‌రాజ్ తెలిపారు. శనివారం బాన్సువాడలో తన నివాసంలో ఆయన మాట్లాడారు. హాథ్ సే హాథ్ జోడో కార్యక్రమంలో భాగంగా ఈ నెల 19న సాయంత్రం నస్రుల్లాబాద్‌కు చేరుకుంటారని, అక్కడ బస చేసి, 20న ఉదయం నస్రుల్లాబాద్ నుంచి పాదయాత్ర ప్రారంభమవుతుందని అన్నారు.

బీబీపేట: నేడు కామారెడ్డిలో జరిగే హాథ్ సే హాథ్ జోడో యాత్రను విజయవంతం చేయాలని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సుతారి రమేష్ కోరారు. శుక్రవారం మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో కరపత్రాలను విడుదల చేశారు.

రాజంపేట: రాజంపేట మండల కేంద్రంలోరేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో చేపట్టనున్న కార్నర్ మీటింగ్‌ను విజయవంత చేయాలని రాజంపేట మండల కాంగ్రెస్ అధ్యక్షులు యాదవరెడ్డి పిలుపునిచ్చారు. శనివారం రేవంత్‌రెడ్డి, మాజీ మంత్రి షబ్బీర్ అలీలు మండల కేంద్రంలో ప్రజల సమస్యలపై మాట్లడనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

పాదయాత్రకు కుల సంఘాల ఆహ్వానం

భిక్కనూరు: కామారెడ్డి పట్టణంలో శనివారం కాంగ్రెస్ పార్టీ నిర్వహిస్తున్న హాథ్ సే హాథ్ జోడో పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పాదయాత్రకు తరలిరావాలని భిక్కనూరు మండలంలో కులసంఘాలకు ఆ పార్టీ నేతలు శుక్రవారం ఆహ్వాన పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో పాల్గొని బీఆర్‌ఎస్ ప్రజా వ్యతిరేకవిధానాలను ప్రజలకు వివరించాలని కోరారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

రామారెడ్డి(ఎల్లారెడ్డి): ఇసన్నపల్లిలో సీసీ రోడ్డు పనులను గ్రామ సర్పంచు కందూరి బాలమణి శుక్రవారం ప్రారంభించారు. వైస్ ఎంపీపీ రవీందర్‌రావు, ఉపసర్పంచ్ రాజేందర్, రైతుబంధు జిల్లా డైరెక్టర్ కసర్ల రాజేందర్, గంగాధర్, శ్యాంరావు, రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కంతాలి తండాలో..

నిజాంసాగర్(జుక్కల్): జుక్కల్ మండలంలోని కంతాలి తాండలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను బీఆర్‌ఎస్ నాయకులు ప్రారంభించారు. ఉప సర్పంచ్ గంగాధర్, బీఆర్‌ఎస్ నాయకులు సీతారాం, శివాజీ, లక్ష్మణ్, తుకారాం, విష్ణు, జాదవ్ నాందేవ్ తదితరులు ఉన్నారు.



ఇసన్నపల్లిలో నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్ బాలమణి

పెద్దకొడప్‌గల్(జుక్కల్): విఠల్‌వాడి తండాలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను స్థానిక ప్రజాప్రతినిధులు ప్రారంభించారు. బీఆర్‌ఎస్ కార్యదర్శి శ్రావణ్ జాదవ్, తండా ప్రజలు పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

పిట్లం(జుక్కల్): గ్రామ పంచాయతీ పరిధిలో నాటిన మొక్కల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని గ్రామ పంచాయతీ కార్యదర్శి జాకీర్ హుస్సేన్ అన్నారు. ఆయన శుక్రవారం వాటరింగ్‌డే సందర్భంగా కారేగాంలో సర్పంచ్ దుర్గయ్యతో కలిసి మొక్కలకు నీళ్లను పట్టారు. ఈ సందర్భంగా కార్యదర్శి మాట్లాడుతూ.. నేటి మొక్కలే రేపటి చెట్లుగా మారి మానవ మనుగడకు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని కోరారు. పంచాయితీ కార్యదర్శి యాదగిరి పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



పంటను పరిశీలిస్తున్న ఏఈవో శ్రీనివాస్ రెడ్డి

సదాశివనగర్(ఎల్లారెడ్డి): వరిలో సస్య రక్షణ చర్యలు చేపట్టాలని ఏఈవో శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. శుక్రవారం అడ్లూర్‌ఎల్లారెడ్డిలో వరి పంటను ఆయన పరిశీలించారు. యాసంగి పంటలపై వచ్చే పురుగులు, తెగుళ్ల గురించి రైతులకు వివరించారు. వరికి అధికంగా అగ్గి తెగులు, ఆకు ముడత పురుగు ఆశించినట్లు తెలిపారు. అగ్గి తెగులు నివారణకు ఐసా ప్రోతయోలిన్ 1.5 ఎంఎల్‌ను లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. ఆకు ముడత నివారణకు కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 2 గ్రాములను లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలన్నారు. ఆయన వెంట గ్రామ రైతులు ఉన్నారు.

శనివార్‌పేట తండాలో వరి పంట..

నిజాంసాగర్(జుక్కల్): శనివార్‌పేట తండా శివారులో సాగు చేస్తున్న వరి పంట పొలాలను శుక్రవారం క్లస్టర్ ఏఈవో గ్రీష్మ పరిశీలించారు. వాతావరణ పరిస్థితుల కారణంగా పంటపొలాలు తెగుళ్ల బారిన పడ్డాయన్నారు. పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. సుగుణ, భోజ్యా ఉన్నారు.

'ప్రవీణ్‌కుమార్ అరెస్ట్ సిగ్గుచేటు'

కామారెడ్డి అర్బన్/పిట్లం: ప్రశ్నాపత్రాల లీకేజీ విషయంలో పరీక్షలను రద్దు చేసి దోషులను శిక్షించాలని, సీబీఐ విచారణ జరిపించాలని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ శాంతియుతంగా చేస్తున్న దీక్షను పోలీసులు భగ్నం చేసి అరెస్ట్ చేయడం సిగ్గు చేటని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు బాల్‌రాజ్, జిల్లా ఇన్‌చార్జి సాయిలు అన్నారు. శుక్రవారం బాల్‌రాజ్ కామారెడ్డిలో, సాయిలు పిట్లంలో మాట్లాడారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్, బీఆర్‌ఎస్ ప్రభుత్వ తీరుపై తీవ్రంగా విమర్శలు చేశారు. నిరుద్యోగ యువతను మోసం చేసిన ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పడానికి ప్రజా పోరాటాలకు బహుజనులు ఏకం కావాలన్నారు. నిందితులను వెంటనే అరెస్ట్ చేయాలన్నారు. కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు.



మాట్లాడుతున్న బీఎస్పీ నేత బాల్‌రాజ్

ఉగాది ప్రశాంతంగా జరుపుకోవాలి

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని వీక్లీమార్కెట్‌లో జరిగే ఉగాది ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని ఆర్డీవో శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. శనివారం ఆయన తన గదిలో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఉత్సవ కమిటీ, సదరు సంఘం కమిటీ సభ్యుల నుంచి సలహాలు సూచనలు తీసుకున్నారు. ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు. కార్యక్రమంలో డీఎస్పీ సురేష్, సీఐ నరేష్, ఉత్సవ కమిటీ, సదరు సంఘం కమిటీ సభ్యులు తదితరులున్నారు.



సమావేశమైన ఆర్డీవో శ్రీనివాస్ రెడ్డి

వైభవంగా శివపార్వతుల కల్యాణం



సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం శివపార్వతుల కల్యాణం వైభవంగా నిర్వహించారు. హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు భారీ ఎత్తున అన్నదానం చేశారు. సర్పంచ్ బద్దం శ్రీనివాస్‌రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ కొప్పుల నర్సారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సరస్వతి ఆలయంలో ప్రత్యేక పూజలు

కామారెడ్డి రూరల్: కామారెడ్డి పట్టణ పరిధిలోని ఇల్చిపూర్ శివారులో కొలువుదీరిన సరస్వతి మాత ఆలయంలో శుక్రవారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు దత్తాద్రిశర్మ, విజయ్‌పాండే, సురేష్‌పాండేల ఆధ్వర్యంలో అమ్మవారికి లలితా సహస్రనామాలతో కుంకుమ అర్చనలు, అభిషేకాలు చేశారు. ఆలయ నిర్మాణ దాత పార్శి విఠల్ పటేల్, భక్తులు పాల్గొన్నారు.

శబరిమాత ఆశ్రమంలో ..

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని శబరిమాత ఆశ్రమంలో గురువారం రాత్రి ప్రత్యేక పూజలు చేశారు. శబరి మాత ప్రతిమ, దివ్యసమాధులను వివిధ రకాల పూలతో అందంగా అలంకరించారు. ఈ సందర్భంగా పల్లకీ సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఘనంగా సంతోషిమాత హారతి

భిక్కనూరు: మండల కేంద్రంలోని నగరేశ్వరాలయంలో సంతోషిమాత హారతి కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు.

పెద్దమ్మ–పెద్దిరాజుల కల్యాణం



భిక్కనూరు: జంగంపల్లిలో పెద్దమ్మ ఆలయ ఉత్సవాలు కొనసాగుతున్నాయి. శుక్రవారం శాస్త్రోక్తంగా వేదబ్రాహ్మణులు పెద్దమ్మ–పెద్దిరాజుల కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పున్న రాజేశ్వర్, సీనియర్ న్యాయవాది గజ్జెల భిక్షపతిలు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కల్యాణం అనంతరం మహిళలు పెద్ద ఎత్తున అమ్మవారికి ఒడి బియ్యం, కట్న కానుకలు సమర్పించుకున్నారు.

సమాచారం..

• నేటి నుంచి ప్రభుస్వామి ఉత్సవాలు

లింగంపేట(ఎల్లారెడ్డి): బోనాల్ గ్రామంలోని ప్రభుస్వామి ఆలయం వద్ద మూడు రోజుల పాటు ఉత్సవాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు సాయాగౌడ్ తెలిపారు. 18న ఎడ్లబండ్ల ప్రదర్శన, 19న రథోత్సవం, 20న కుస్తీ పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు.

• ప్రవేశపరీక్ష దరఖాస్తు గడువు పెంపు

భిక్కనూరు/మద్నూర్: సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో ఐదవ తరగతిలో ప్రవేశం కోసం దరఖాస్తు గడువును ప్రభుత్వం ఈ నెల 20 వరకు పొడిగించినట్లు భిక్కనూరు, మద్నూర్, గురుకుల పాఠశాల ప్రిన్సిపాళ్లు నర్సింహారెడ్డి, సవితలు శుక్రవారం తెలిపారు. దరఖాస్తు చేసుకున్న వారికి ఏప్రిల్ 23న ఉదయం 11 గంటలకు పరీక్ష నిర్వహిస్తారు.

• గురుకుల ప్రవేశ పరీక్షకు ఉచిత శిక్షణ

బాన్సువాడ టౌన్: గురుకుల పాఠశాలలో ఐదవ తరగతి ప్రవేశ పరీక్ష కోసం దరఖాస్తులు చేసుకున్న విద్యార్థులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు దళిత హక్కుల పోరాట సమితి గౌరవ అధ్యక్షులు అయ్యాల సంతోష్ తెలిపారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల కోసం ఈ నెల 23 నుంచి బాన్సువాడ సాయికీర్తి జూనియర్ కళాశాలలో ఉచితంగా కోచింగ్ ఇవ్వనున్నట్లు ఆయన వివరించారు. విద్యార్థులు 7386965601, 9908294492లకు సంప్రదించాలని కోరారు.

సంక్షిప్తం

ప్రభుత్వ విప్‌నకు ఆహ్వానం

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని వీక్లీ మార్కెట్‌లో జరిగే ఉగాది ఉత్సవాలకు హాని ప్రభుత్వ విప్ గంపగోవర్ధన్ కామారెడ్డి పట్టణ అభివృద్ధి సదరు సంఘం నాయకులు శుక్రవారం కోరారు. ఆయన నివాసంలో ఆహ్వాన పత్రికను అందజేశారు. నాయకులు లక్ష్మీనారాయణ, సాయిలు తదితరులున్నారు.

ఇంటి వద్ద వ్యాయామాలు చేయించాలి

పిట్లం(జుక్కల్): మండల కేంద్రంలోని భవిత సెంటర్‌లో మండల విద్యాధికారి దేవిసింగ్ ఆధ్వర్యంలో శుక్రవారం దివ్యాంగ విద్యార్థుల కోసం ఫిజియోథెరపి క్యాంప్ ఏర్పాటు చేశారు. ఈ క్యాంప్‌లో ఫిజియోథెరపిస్ట్ విశాలక్ష్మి 10 మందికి పరీక్షలు చేశారు. అనంతరం దివ్యాంగ విద్యార్థులకు ఇంటి వద్ద వ్యాయామాలు చేయించాలని వారి తల్లిదండ్రులకు సూచించారు. ఉపాధ్యాయులు కమల్ కిషోర్, గంగాధర్ పాల్గొన్నారు.

బీర్కూర్‌లో మహాజన సభ

నస్రుల్లాబాద్(బీర్కూర్): బీర్కూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో శుక్రవారం మహాజన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఈవో విఠల్ గత ఆరు నెలల సంఘం లావాదేవీలను సభ్యుల ముందు చదివి వినిపించారు. కార్యక్రమంలో చైర్మన్ గాంధీ, ఎంపీపీ రఘు పాల్గొన్నారు.